సాక్షి జగిత్యాల

బుధవారం । 20 । డిసెంబర్ । 2023



శ్రీరామదూత నమోనమః
కొండగట్టు: అంజన్న ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తుల ఏర్పాట్లను ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ సునీల్, ఆలయ అధికారులు పర్యవేక్షించారు.



ముక్కోటి వేడుకలకు రండి
ధర్మపురి: నృసింహాలయంలో జరిగే ముక్కోటి ఏకాదశికి రావాలని కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఆలయ ఈవో శ్రీనివాస్ ఆహ్వాన పత్రిక అందించారు.

గరిష్టం/కనిష్టం
27.0/16.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై కనిపిస్తుంది. సాయంత్రం, రాత్రి చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

కోవిడ్ కొత్త వేరియంట్‌పై అప్రమత్తంగా ఉండాలి



సమీక్షిస్తున్న జెడ్పీ చైరపర్సన్ దావ వసంత

జగిత్యాలజోన్: కోవిడ్ కొత్త వేరియంట్ వ్యాపిస్తున్న నేపథ్యంలో వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. కోవిడ్ కొత్త కేసులపై వైద్య సిబ్బందితో జెడ్పీ కార్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు నిరంతరం జరిగేలా చూడాలని, కొత్త వేరియంట్ పల్లెలకు చేరకముందే ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఆశావర్కర్లు, ఏఎన్ఎంలతో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. శ్వాసకోశ సమస్యలు, వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారిపట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నరేష్, డిప్యూటీ సీఈఓ రఘువరణ్, డీఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీధర్, డీపీవో దేవరాజ్ పాల్గొన్నారు.

పాల 'బోనస్' ఇప్పించండి



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న జిల్లా పాడిరైతులు

జగిత్యాలరూరల్: వివిధ డెయిరీలకు పాలు విక్రయించిన రైతులకు బోనస్ ఇప్పించాలని కోరుతూ జిల్లాకు చెందిన పాడి రైతులు హైదరాబాద్‌లోని అంబేడ్కర్,పూలేభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. విజయ డెయిరీ, కరీంనగర్ మిల్క్‌ప్రొడ్యూసర్ కంపెనీ, స్వశక్తి డెయిరీలకు పాలు విక్రయించే రైతులకు లీటర్‌కు రూ.4చొప్పున బోనస్ ఇస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చిందని, మొదటి విడత రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేసిన ప్రభుత్వం అనంతరం మర్చిపోయిందని గుర్తు చేశారు. ఆ బోనస్ ఇప్పించి పాడి రైతులను ఆదుకోవాలని కోరారు.

కొండగట్టు ఆలయ ఈవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు



ఫిర్యాదు పత్రంతో రవీందర్

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టులోని శ్రీఆంజనేయ స్వామి ఆలయ ఈవో వెంకటేశ్ భక్తుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని సమాచారహక్కు చట్టం జిల్లా అధ్యక్షుడు అక్కపెల్లి రవీందర్ జిల్లా కలెక్టర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. కొండపై టెండర్లు పొందిన దుకాణదారులు భక్తుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారని, పారిశుధ్యం సరిగా లేదని, అధికారులు టెండర్ డబ్బులు రికవరీ చేయడం లేదని, ఈవోకు భక్తులు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదని పేర్కొన్నారు. కార్యాలయంలో సమాచార బోర్డు లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఆయనపై చర్యలు తీసుకోవాలని, కలెక్టర్, కమిషనర్ స్పందించి భక్తులకు సౌకర్యాలు మెరుగుపర్చాలని ఫిర్యాదులో కోరారు.

మల్యాలకు చేరిన అయోధ్య రామయ్య అక్షింతలు

మల్యాల: మండల కేంద్రానికి అయోధ్య రామయ్య అక్షింతలు చేరుకోగా, అక్షింతల కలశాలతో స్థానిక బ్లాక్ చౌరస్తా నుంచి శోభాయాత్రతో అయ్యప్ప దీక్షాపరులు మత మాంజనేయస్వామి ఆలయంలో భద్రపరిచారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ద్వారా అయోధ్య రామ మందిరం ప్రాణప్రతిష్ఠ అంక్షింతలు జనవరి 1 నుంచి 5 వరకు ఇంటింటికి పంపిణీ చేస్తామని సంఘ్ పరివార్ బాధ్యులు తెలిపారు.

పుణ్యస్నానాలకు పుట్టెడు కష్టాలు

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందింది ధర్మపురి. ఇక్కడి గోదావరిలో స్నానం చేస్తే కాశీలో చేసినంత పుణ్యఫలం లభిస్తుందన్నది భక్తుల నమ్మకం. ఇక్కడకు నిత్యం వేలాదిమంది భక్తులు వస్తున్నా.. వారికి సరిపడా వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా మహిళల పరిస్థితి వర్ణనాతీతం. మహిళలు బట్టలు మార్చుకునేందుకు ఇక్కడ ప్రత్యేక షెడ్లు కూడా లేవు. పుష్కరఘాట్లు అనుకూలంగా ఉన్నా.. దుస్తులు మార్చుకునేందుకు కేవలం రెండు షెడ్లు మాత్రమే ఉన్నాయి. అవి కూడా రంధ్రాలు పడడంపై భక్తులు పెదవి విరుస్తున్నారు.

- ధర్మపురి గోదావరి వద్ద కరువైన వసతులు
- కనీస సౌకర్యాల కల్పనపై అధికారుల నిర్లక్ష్యం
- ఆవేదన చెందుతున్న భక్తులు

ధర్మపురి: జిల్లాలోనే ధర్మపురి నృసింహస్వామి ఆలయం ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతోంది. ఇక్కడ స్వామివారి స్వయంభూగా వెలిశారని పురణాలు చెబుతున్నాయి. అలాంటి ఆలయానికి రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కూడా నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. ముందుగా గోదావరిలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటారు. వీరిద్వారా అటు మున్సిపాలిటీకి, ఇటు ఆలయానికి ఏటా కోట్లలో ఆదాయం సమకూరుతోంది. ఇంత ఆదాయం ఉన్నా.. భక్తులకు కనీసవసతులుమాత్రం కల్పించలేకపోతున్నారు.

పుష్కర కాలం నాటి షెడ్లే గతి..

గోదావరిలో స్నానాలకు వచ్చిన భక్తులు దుస్తులు మార్చుకునేందుకు షెడ్లు లేవు. కేవలం రెండు షెడ్లు ఉన్నా.. అవికూడా కాలం చెల్లినవే కావడం గమనార్హం. ఎప్పుడో గోదావరి పుష్కరాల సమయంలో ఏర్పాటు చేసినవి కావడంతో పైకప్పులు లేవు. అంగుళానికో రంధ్రాలు పడ్డాయి. మహిళలు బట్టలు



గోదావరిలో స్నానాలు చేస్తున్న భక్తులు

మార్చుకునే సమయంలో షెడ్లకున్న రంధ్రాలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తోటి భక్తులు చీరలను చుట్టూ పట్టుకుంటేనే దుస్తులు మార్చుకునే పరిస్థితులు ఉన్నాయి. సంతోషిమాత ఘాట్, మంగలిగడ్డ ఘాట్, మహాలక్ష్మి ఘాట్, సోమవిహార్ ఘాట్ల వద్ద భక్తులు స్నానం చేస్తుంటారు. మంగలిగడ్డ ఘాట్ వద్ద మాత్రమే బట్టలు మార్చుకునేందుకు రెండు షెడ్లు తప్ప ఎక్కడా లేవు.

రెండు నెలల్లో బ్రహ్మోత్సవాలు

- గోదావరికి ప్రతిరోజూ వేల సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. కార్తీకమాసం, సట్టివారాల సందర్భంగా ఇక్కడ పుణ్యస్నానాలు చేయడం ఆనవాయితీ.
- మరో రెండు నెలల్లో స్వామివారి బ్రహ్మోత్సవాలు రానున్నాయి.
- మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రతిఘాట్ వద్ద ప్రత్యేక షెడ్లను ఏర్పాటు చేయాలి.
- భక్తులకు నీడ వసతి, బాత్రూమ్‌లు తప్పనిసరి.
- వేసవిలో తాగునీటి సౌకర్యం కల్పించాలి.
- పట్టణంలోని డ్రెయినేజీ నీరంతా గోదావరిలో కలుస్తోంది. అది తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఆ నీరు గోదావరిలో కలవకుండా ఏర్పాట్లు చేయాలి.



మహిళలు దుస్తులు మార్చుకునే షెడ్లు ఇలా..

- గోదావరి పరిసరాల్లో ఎప్పటికప్పుడు చెత్తాచెదారం లేకుండా పారిశుధ్య పనులు చేపట్టాలి.
- ప్లాస్టిక్ వస్తువులు, కొబ్బరిపీచు వంటివి భక్తులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నాయి. వాటిని పారిశుధ్య సిబ్బందితో ఎప్పటికప్పుడు ఏరివేయాలి.

వసతుల కల్పనకు చర్యలు



ధర్మపురి గోదావరిలో స్నానాలు ఆచరించే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటా. ఇక్కడ శాశ్వత వసతులపై దేవాదాయశాఖ దృష్టికి తీసుకెళ్తా. కలెక్టర్‌తో మాట్లాడి వసతుల కల్పనకు కృషి చేస్తా. భక్తులతోపాటు పట్టణ ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తాం.

– అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్

వసతులు లేవు



గోదావరిలో స్నానం చేస్తే పుణ్యం లభిస్తుందని జయశంకర్‌భూపాలపల్లి జిల్లా నుంచి ఇక్కడకు వచ్చినం. గోదావరిలో కనీస సౌకర్యాలు లేవు. బట్టలు మార్చుకునేందుకు వసతులు ఏమీ లేవు. ఉన్నవే రెండు షెడ్లు.. అవి కూడా రంధ్రాలు పడ్డాయి. ఆ రెండిట్లో వేలాది మంది మార్చుకోలేరు కదా..?

– స్వరూప, భక్తురాలు, భూపాలపల్లి

తడిబట్టలతోనే ఉన్నం



సంతోషిమాత ఘాట్‌వద్ద పుణ్యస్నానం చేసినం. బట్టలు మార్చుకుందామంటే షెడ్లు లేవు. తడిబట్టలతో దైవదర్శనానికి వెళ్తున్నం. నిత్యం వేలాది మంది భక్తులు వచ్చే పుణ్యక్షేత్రంలో సౌకర్యాలు లేకపోవడం బాధాకరం. పొదలచాటుకు వెళ్లి బట్టలు మార్చుకోవాల్సి రావడం దురదృష్టకరం.

– శంకరవ్వ, భక్తురాలు

షెడ్లు ఏర్పాటు చేస్తాం



భక్తులకు వసతులు కల్పిస్తాం. ఇంతకముందు దేవస్థానం ఆధ్వర్యంలో షెడ్లు ఏర్పాటు చేశాం. అవి గోదావరికి వరదలు వచ్చినప్పుడు కొట్టుకుపోయాయి. కొన్ని సరిగా లేవు. వాటిని మార్చాల్సిన అవసముంది. కొత్తవాటిని ఏర్పాటు చేయడంతోపాటు పాతవాటికి మరమ్మతు చేయించాల్సి ఉంది.

శ్రీనివాస్, ఆలయ ఈవో

ఇబ్బందులు తలెత్తనీయం



గోదావరిలో పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా చూస్తాం. గోదావరి వద్ద చెత్తాచెదారం, అపరిశుభ్రం లేకుండా నిత్యం మున్సిపల్ సిబ్బందితో తొలగిస్తున్నాం. పుష్కరఘాట్ల వద్ద హైమాస్‌లైట్లు ఉన్నాయి. అలాగే భక్తులు దుస్తులు మార్చుకునేందుకు షెడ్లు ఏర్పాటు చేస్తాం.

– రమేష్ మున్సిపల్ కమిషనర్

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటామని, సదరం శిబిరాలు నిర్వహించి సర్టిఫికెట్లు అందిస్తామని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం అధికారులతో సమావేశమయ్యారు. సదరం సర్టిఫికెట్ల కోసం క్యాంపులు నిర్వహిస్తామని, శిబిరాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, కంప్యూటీకరణ, సిబ్బందిని నియమిస్తామని, శిబిరాలకు వచ్చే బాధితులకు సదుపాయాలు కల్పించాలని అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు.. పథకాల్లో 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్నారు. స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేసి బ్యాంక్ లింకేజీ రుణాలు అందించాలని ఆదేశించారు. దివ్యాంగుల చట్టాలపై జిల్లా, మండల అధికారులకు వివరించడంతో పాటు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దివ్యాంగులకు మంజూరైన బ్యాటరీ సైకిళ్లు, అవసరమైన ఉపకరణాలు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, డీఆర్డీఏ పీడీ నరేశ్, డీఈవో జగన్మోహన్‌రెడ్డి, ఎల్‌డీఎం వెంకట్‌రెడ్డి, అదనపు డీఆర్డీవో సుధీర్ పాల్గొన్నారు.

దత్త జయంతి ఉత్సవాలు ప్రారంభం



దత్తాత్రేయుడికి పూజలు చేస్తున్న అర్చకులు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధం దత్తాత్రేయ స్వామి ఆలయంలో మంగళవారం దత్త జయంతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. వేదపండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య కలశపూజ, రుద్రాభిషేకం, పురుషసూక్తం వంటి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఎంసెట్, నీట్ శిక్షణ



ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న లెక్చరర్

- జిల్లాలో 1,100 మందికి ప్రయోజనం
- వచ్చే నెల ఒకటి నుంచి ప్రారంభం
- ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు వరం

కథలాపూర్(వేములవాడ): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంసెట్, నీట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించేలా వారికి శిక్షణ ఇవ్వాలని ఇంటర్ బోర్డు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల్లో చాలామంది పేదలే ఉంటారు. కుటుంబపోషణకు వ్యవసాయ పనులకు వెళ్తుంటారు. కోచింగ్ వెళ్లే పరిస్థితి ఉండదు. ఈ కారణంగానే వారు ఎంసెట్, నీట్‌లో మంచి మార్కులు సాధించడం లేదని గుర్తించిన అధికారులు.. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది.

జిల్లాలో 1,100 మందికి ప్రయోజనం

జిల్లాలో 15 జూనియర్ కళాశాలలున్నాయి. ఎంపీసీ (సెకండియర్)లో 600మంది, బైపీసీలో 500 మంది విద్యార్థులున్నారు. కళాశాలల్లో ఈనెలలోనే సిలబస్ పూర్తి చేయడంపై దృష్టిసారించారు. జనవరి ప్రారంభం నుంచి ఫిబ్రవరి చివరి వరకు ఎంసెట్, నీట్ శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. వార్షిక పరీక్షలు పూర్తయ్యాక వేసవి సెలవులు ప్రకటిస్తారు.

అవకాశాన్ని వినియోగించుకోవాలి



ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఎంసెట్, నీట్‌లో మెరుగైన ర్యాంకు పొందాలన్నదే లక్ష్యం. వచ్చే నెల ఒకటి నుంచి కళాశాలల్లో ఎంసెట్, నీట్ శిక్షణ తరగతులు నిర్వహిస్తాం. వార్షిక పరీక్షలు పూర్తయ్యాక జిల్లాకేంద్రంలో 100 మందికి ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. – నారాయణ, జిల్లా నోడల్ అధికారి

శిబిరానికి 100 మంది ఎంపిక

వేసవిలో ఎంసెట్, నీట్ శిక్షణకు జిల్లాలో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రత్యేక పరీక్ష నిర్వహించి ప్రతిభ చాటిన 50మంది బాలురు, 50 మంది బాలికలకు జిల్లాకేంద్రంలో ఉచితంగా శిక్షణ ఇస్తారు. వారికి ఉచిత వసతి, భోజనం, స్టడీ మెటీరియల్ అందిస్తారు.

సీఎంఆర్ ఇవ్వని మిల్లులపై చర్యలు తీసుకోండి



కలెక్టర్‌తో ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్

జగిత్యాల: రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని తీసుకున్న మిల్లులు ప్రభుత్వానికి తిరిగి సీఎంఆర్ ఇవ్వని మిల్లులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కలెక్టర్ యాస్మిన్ బాషాకు సూచించారు. రైస్‌మిల్లర్లు నిర్దేశిత సీఎంఆర్ ఇవ్వకపోవడం నిబంధనలకు విరుద్ధమన్నారు. యాసంగికి సంబంధించి ధాన్యం 3.5 లక్షల టన్నులు మిల్లర్ల వద్ద ఉందన్నారు. విజిలెన్స్ విచారణ చేపట్టి మిల్లర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. వారివెంట నాయకులు జువ్వాడి నర్సింగరావు ఉన్నారు.

రాష్ట్రస్థాయి గణిత సదస్సుకు రామారావుపల్లి హెచ్‌ఎం



రాయికల్: ఈనెల 22న రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ నిర్వహించే రాష్ట్రస్థాయి గణిత సదస్సుకు రాయికల్ మండలం రామారావుపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కడకుంట్ల అభయ్‌రాజ్ ఎంపికైనట్లు ఎంఈవో గంగాధర్ తెలిపారు. విద్యార్థులను శక్తివంతంగా తయారుచేయడానికి గణితంపాత్ర (ఆటల ద్వారా అభ్యాసన) అనే అంశంపై రూపొందించిన పరిశోధన పత్రంతో ఎంపికైనట్లు పేర్కొన్నారు. అభయ్‌రాజ్‌ను డీఈవో జగన్మోహన్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పొన్నం రమేశ్, మండల అధ్యక్షుడు రాపర్తి నర్సయ్య అభినందించారు.

ప్రజా సంక్షేమానికి కృషి చేద్దాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్, పక్కన కలెక్టర్

జగిత్యాల: ప్రజల సంక్షేమానికి ప్రతిఒక్కరం కృషి చేద్దామని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వివిధ అభివృద్ధి పనులపై కలెక్టరేట్‌లో కలెక్టర్ యాస్మిన్ బాషాతో కలిసి సమీక్షించారు. ప్రజల సంక్షేమానికి అధికార యంత్రాంగ సహకారం ఎంతో అవసరమని, సాగునీటి ప్రాజెక్టులు, ఆనకట్టల నిర్మాణాలు, పెండింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు. వర్షాకాలంలో తెగిపోయిన చెరువుల పునరుద్ధరణపై చర్చించారు. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీ అమలవుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. పథకాలు గ్రామసభల ద్వారా పారదర్శకంగా అందేలా చూడాలన్నారు. కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ముందుగా విప్ శ్రీనివాస్‌కు కలెక్టర్ యాస్మిన్ బాషా శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టరేట్‌లో పూలబొకే అందించి స్వాగతం పలికారు.

కరాటేకు సహకారం

కరాటే నేర్చుకునేవారికి సహకరిస్తామని విప్ అన్నారు. ఒకినావా మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కరాటే పోటీల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు వసంత్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



పాల్గొన్న కళాశాల విద్యార్థులు



మాట్లాడుతున్న సైబర్ క్రైం డీఎస్పీ రంగారెడ్డి

జగిత్యాలక్రైం: యువత డ్రగ్స్, గంజాయి వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ రంగారెడ్డి అన్నారు. స్థానిక మెడికల్ కళాశాలలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్, క్రైం, ర్యాగింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. యువత బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలన్నారు. ఏ నేరానికి పాల్పడినా ఉద్యోగాలకు అనర్హులని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్‌పై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రత పాటించాలని సైబర్‌క్రైం డీఎస్పీ రంగారెడ్డి సూచించారు. కార్యక్రమంలో సీసీఎస్ సీఐ వెంకటేశ్వర్లు, ప్రగతి, సమీర్, ఏవోలు రవీందర్‌సింగ్, సంజీవ్, ఎస్ఈవో రత్నాకర్‌రావు, షీటీం సభ్యులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల కోసం ఎదురుచూపు

- ఏళ్ల తరబడి మంజూరుకాని వైనం
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు

రాయికల్: జిల్లాలో లబ్ధిదారులు రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. తాము అధికారంలోకొస్తే రేషన్‌కార్డులు జారీ చేస్తామని చెప్పినట్టుగానే కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆశలు రేకెత్తుతున్నాయి. మరోవైపు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాష్ట్రంలోని రేషన్‌కార్డుల వివరాలు, కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 592 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 14,534 అంత్యోదయ కార్డులున్నాయి. ఆహారభద్రత కార్డులు 2,92,490 ఉన్నాయి.



ఆరేళ్లుగా మంజూరుకాని రేషన్‌కార్డులు

ఆరేళ్లుగా రేషన్‌కార్డులు కొత్తవి మంజూరు కాకపోవడంతో వివాహమైన, వేరుకాపురాలు పెట్టిన దంపతులు.. వారికి పుట్టిన పిల్లల పేర్లు కూడా కార్డుల్లో నమోదు కాలేదు. మరోవైపు పెళ్లయిన వెంటనే ఆడబిడ్డల పేర్లు పుట్టింట్లో తొలగించిన అధికారులు.. మెట్టినింట్లో మాత్రం చేర్చలేదు. దీంతో వీరంతా కొత్త కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు.

ఆరేళ్ల క్రితం దరఖాస్తు చేసిన



మాది మేడిపల్లి మండలం పోరుమల్ల గ్రామం. రేషన్ కార్డు కోసం ఆరేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్న. ఇప్పటివరకు కార్డు రాలేదు. నా కూతురుకు ఇప్పుడు ఏడేళ్లు. ఆమె పేరు చేర్చాలన్నా అధికారులు పట్టించుకోలేదు.

– లక్కం నరేశ్, పోరుమల్ల, మేడిపల్లి మండలం

ఐదేళ్లయినా రాలే..



మాది రాయికల్ పట్టణం. నాకు పెళ్లయి ఐదేళ్లు అయింది. నా కొడుకు హార్దిక్, భార్య కృష్ణవేణి పేర్లను రేషన్‌కార్డులో నమోదు చేసేందుకు ఐదేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పటికీ రేషన్‌కార్డు మంజూరు కాలేదు. – బండి మణిదీప్, కృష్ణవేణి దంపతులు, రాయికల్

ఉత్తర్వులు రాలేదు



రేషన్‌కార్డుల దరఖాస్తులపై ఇప్పటివరకు ఉత్తర్వులు రాలేదు. ఇటీవల మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే ప్రకటన చేస్తాం. ఆ తర్వాతే కొత్తగా దరఖాస్తులు స్వీకరిస్తాం.

– వెంకటేశ్వర్‌రావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

జెడ్పీ సీఈవో నరేశ్ బదిలీ



నరేష్‌ను సన్మానిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత

జగిత్యాలజోన్: జెడ్పీ సీఈఓ నరేశ్ బదిలీ అయ్యారు. ఆయన జిల్లా డీఆర్‌డీఏ పీడీగా వెళ్లనున్నారు. దీంతో ఆయనను జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, సిబ్బంది మంగళవారం సన్మానించారు. నరేశ్ ఏడాదిపాటు జెడ్పీ సీఈఓగా కొనసాగారు. ఆయన స్థానంలో ఇప్పటివరకు డిప్యూటీ సీఈఓగా పనిచేసిన రఘువరన్‌కు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. నూతన సీఈఓగా నియమితులైన రఘువరన్‌ను కూడా చైర్‌పర్సన్, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

క్లుప్తంగా

బావిలో పడ్డ ట్రాక్టర్

- తప్పిన పెను ప్రమాదం



క్రేన్ సహాయంతో బావిలోంచి తీస్తున్న ట్రాక్టర్

రాయికల్: మండలంలోని బోర్నపల్లి శివారులో ఓ ట్రాక్టర్ బావిలో పడింది. ఎవరికి ఏమీ కాక పోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. గ్రామానికి చెందిన ఓ యజమాని ట్రాక్టర్‌పై భీంరావు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఓ రైతు ధాన్యం తెచ్చుకునేందుకు ట్రాక్టర్‌ను అద్దెకు మాట్లాడుకున్నాడు. డ్రైవర్ ట్రాక్టర్‌ను తీసుకెళ్లి.. ట్రాలీని వదిలి ఇంటికొస్తుండగా అజాగ్రత్తగా నడపడంతో అదుపుతప్పి వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. అప్రమత్తమైన భీంరావు ట్రాక్టర్‌పైనుంచి దూకి ప్రాణాలు రక్షించుకున్నాడు. బావిలో పడిన ట్రాక్టర్‌ను భారీ క్రేన్ సహాయంతో బయటకు తీశారు.

పలువురిపై పిచ్చికుక్క దాడి



ఎలిగేడు(పెద్దపల్లి): ధూళికట్ట గ్రామంలో పిచ్చికుక్క మంగళవారం పలువురిపై దాడిచేసింది. రోడ్డు వెంట పరుగెడుతూ కనిపించిన వారిని కరిచింది. ఇందులో జక్కుల భూమయ్య, దాసరి మల్లయ్య, అనిత, కిషన్‌రావు, లస్మయ్య, సంపత్, తిరుపతి, మరికొందరు గాయాల పాలయ్యారు. కనిపించిన వారిపై పిచ్చికుక్క దాడిచేయడంతో స్థానికులు పరుగులు పెట్టారు. బాధితులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గోదావరిఖని లూర్దునగర్‌కు చెందిన మారంరెడ్డి ఇన్నారెడ్డి తన ద్విచక్ర వాహనంపై ప్లాంట్ రోడ్డు మీదుగా లూర్దునగర్ వెళ్తున్నాడు. ఈక్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఇన్నారెడ్డి కిందపడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ప్రాజెక్టు ఏజీఎం(హెచ్ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్.. గాయపడిన వ్యక్తిని 108 వాహనం ద్వారా గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బ్యాంకు ఖాతాలోంచి డబ్బులు మాయం

పెద్దపల్లిరూరల్: బ్యాంకులో దాచుకున్న డబ్బు ఖాతాదారులకు తెలియకుండానే సైబర్‌నేరగాళ్లు కాజేస్తున్నారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించి తమ గోడువెళ్లబోసుకుంటున్నారు. ఈక్రమంలో పట్టణంలోని పలు ప్రాంతాలు, పెద్దకల్వలకు చెందిన పలువురి బ్యాంకుఖాతాల్లోంచి డబ్బు మాయమైంది. బాధితులు మంగళవారం ఎస్సై మహేందర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఇందులో పెద్దపల్లి మండలం పెద్దకల్వలకు చెందిన కల్వల వసంత, రాజేశం, బత్తిని సత్యనారాయణ తదితరులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, నగదు లావాదేవీల కోసం వేలిముద్రలు వేస్తున్నారని, ఇలాంటి సమయాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆధార్, ఓటీపీ నంబర్లను ఎవరికీ చెప్పవద్దని సూచించారు.

భూ వివాదం.. రెండుశాఖలకు శాపం

- రోజురోజుకూ పెరుగుతున్న దరఖాస్తుదారులు
- ఆర్డీవో కార్యాలయానికి భారీగా తాకిడి
- పోలీసు, రెవెన్యూ శాఖలకు తలనొప్పి



నర్సింగాపూర్ శివారులోని ప్రభుత్వ భూమిలో వెలిసిన గుడిసెలు

జగిత్యాలరూరల్: జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ భూమి వివాదం అటు రెవెన్యూ, ఇటు పోలీస్ శాఖలకు తలనొప్పిగా మారింది. జగిత్యాల శివారు నర్సింగాపూర్‌లోని ప్రభుత్వ భూమిని నిరుపేదలకు ఇప్పిస్తామంటూ కొంతమంది జిల్లాతోపాటు కరీంనగర్, సిద్దిపేట, సిరిసిల్ల, కామారెడ్డి, పెద్దపల్లి జిల్లాలకు చెందిన పేదలను మభ్యపెట్టి ఇక్కడ తాత్కాలికంగా గుడిసెలు వేయించారు. విషయం తెలుసుకుంటున్న చుట్టుపక్కల జిల్లాల ప్రజలు భారీఎత్తున తరలివచ్చి ఇక్కడి ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని ఉంటున్నారు. వారిని కట్టడి చేయడం రెండు శాఖలకు తలనొప్పిగా మారింది. జగిత్యాలరూరల్ మండలం నర్సింగాపూర్ శివారులోని సర్వేనంబరు 437లోగల ప్రభుత్వ భూమిలో ఎన్నికలకు ముందు కొంతమందితో గుడిసెలు వేయించారు. ఎన్నికల బిజీలో ఉన్న రెవెన్యూ, పోలీసు శాఖ చూసీచూడనట్లు వ్యవహరించాయి. ఈ క్రమంలో అక్కడ సుమారు 800వరకు గుడిసెలు వెలిశాయి. ఇదే క్రమంలో సోమవారం కూడా భూమిలేని నిరుపేదలందరికీ ప్రభుత్వ భూమిలో పట్టాలిస్తున్నారని కొందరు ప్రచారం చేయడంతో వివిధ జిల్లాల నుంచి సుమారు ఐదు వేల మంది వరకు తరలివచ్చారు. తమకు పట్టాలు ఇవ్వాల్సిందేనని జిల్లాకేంద్రంలో భారీ ర్యాలీ తీశారు. వారంతా నర్సింగాపూర్ గ్రామానికి వెళ్లి అక్కడున్న ప్రభుత్వ భూమిలో చీరలతో తాత్కాలికంగా గుడిసెలు ఏర్పాటు చేసుకుంటున్నారు. గుడిసెలు వేసుకునేలా ప్రోత్సహించిన ఏడుగురిపై గతంలోనే రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అయితే వారిని పోలీసులు అదుపులోకి తీసుకోకపోవడంతో వారే తాజాగా పేదలను ఇక్కడికి రప్పించి అక్రమంగా గుడిసెలు వేసేలా ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

భారీగా దరఖాస్తులు

నర్సింగాపూర్ శివారులో ప్రభుత్వ భూమికి పట్టాలిస్తున్నారని ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల నుంచి మంగళవారం కూడా భారీగా మహిళలు వచ్చి దరఖాస్తులను జగిత్యాల ఆర్డీవో కార్యాలయంలో సమర్పించారు. మరోవైపు నర్సింగాపూర్‌లోని ప్రభుత్వ భూమిలో గత ప్రభుత్వం కొన్ని కులసంఘాలకు పట్టాలు ఇచ్చింది. దీంతో వారు ఆ ప్రాంతాన్ని చదును చేసి హద్దులు ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు వివిధ జిల్లాల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చి గుడిసెలు, తాత్కాలిక గుడారాలు వేస్తుండటంతో పట్టాలు తీసుకున్న కుల సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. వారు కూడా మోకాపైకి వస్తే రెండువర్గాల మధ్య ఘర్షణలు జరిగే పరిస్థితి నెలకొంది.

చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూఅధికారులు

40 రోజులుగా రోజుకు కొంతమంది ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేస్తున్నా రెవెన్యూ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలూ తీసుకోకుండా ఎన్నికల విధుల పేరుతో కాలం వెళ్లదీశారు. ప్రస్తుతం గుడిసెల సంఖ్య సుమారు 800లకు చేరుకోవడంతో రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసి చేతులు దులుపుకున్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాం

- గ్రామస్థాయి వరకూ కేంద్రప్రభుత్వ పథకాలు
- బీజేపీ దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్



మాట్లాడుతున్న ఎస్.కుమార్

ధర్మారం(ధర్మపురి): ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని బీజేపీ దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ అన్నారు. నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎస్.కుమార్ మాట్లాడారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గ్రామస్థాయిలో ప్రతీవ్యక్తి వినియోగించుకోవాలని సూచించారు. మోదీ ప్రధాని అయ్యాక అనేక కఠిన నిర్ణయాలు తీసుకుని సంస్కరణలు అమలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుజ్జుల వేణుగోపాల్‌రెడ్డి, మెడవేని శ్రీనివాస్, తీగుళ్ల సతీశ్‌రెడ్డి, సందనవేని లక్ష్మణ్, ఎల్లాల మహేందర్‌రెడ్డి, కొలిపాక మణికంఠ, కొక్కుల బాలకృష్ణ, కోరె రమేశ్, గౌతం తదితరులు పాల్గొన్నారు.

పాతకక్షలతో తండ్రీకొడుకులపై దాడి

- 8 మందిపై హత్యాయత్నం కేసు



పెద్దపల్లిరూరల్: రాగినేడు గ్రామంలో మంగళవారం తండ్రీకొడుకులైన ఇల్లందుల వీరయ్య, పర్శరాములుపై ప్రత్యర్థులు కార్తీక్, వెంకటేశ్‌తోపాటు కొందరు కర్రలతో దాడి చేశారని ఎస్సై మహేందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. దాదాపు రెండేళ్ల క్రితం జరిగిన ఓ సంఘటనకు సంబంధించి పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని ఈదాడికి దిగారు. దాడిలో వీరయ్య తలకు బలమైన గాయమైంది. అయ్యప్పదీక్షలో ఉన్న పర్శరాములుపై కూడా దాడి చేయగా.. ఆయన పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు. గాయపడ్డ వారిని స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఈ ఘటనపై పర్శరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎనిమిదిమందిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాయికల్: మండలంలోని రాజనగర్ గ్రామానికి చెందిన గాందారి భాస్కర్ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. ఈనెల 18న మండలంలోని రామాజీపేట శివారులో అల్లీపూర్‌కు చెందిన ప్రణయ్ ఎలాంటి సిగ్నల్ ఇవ్వకుండా తన బైక్‌ను అజాగ్రత్తగా నడిపి భాస్కర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో భాస్కర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమించి భాస్కర్ మృతిచెందాడు. భాస్కర్ మామ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సింగరేణిని సమాధి చేయాలని చూస్తున్నారు

- ఏఐఎఫ్‌టీయూ గౌరవ అధ్యక్షురాలు విమలక్క



గోదావరిఖని: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి సంస్థను సమాధి చేయాలని చూస్తున్నాయని ఏఐఎఫ్‌టీయూ గౌరవ అధ్యక్షురాలు విమలక్క అన్నారు. మంగళవారం జీడీకే–11గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. కార్మిక వర్గ హక్కుల కోసం నిజాయితీగా పోరాడే విప్లవ సంఘాల ను ఆదరించాలన్నారు. యాజమాన్యం కార్మి కులు కష్టపడి సాధించిన లాభాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ శక్తులకు నాలుగు బ్లాకులను అప్పగించాలని చూస్తోందని పేర్కొన్నారు. ఏటా కార్మికుల శ్రేయస్సు కోసం రూ.200 కోట్లను సింగరేణి కేటాయిస్తోందని అన్నారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎన్నికల్లో చక్రంలో సుత్తిగుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు కె.విశ్వనాథ్, ఎం.దుర్గయ్య, శేఖ ర్, మాతంగి రాయమల్లు, యాకన్న, జగదీశ్, ఎం.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రామడుగు ఎంపీపీపై అవిశ్వాస తీర్మాణం



అవిశ్వాస తీర్మానం లేఖను అందిస్తున్న కాంగ్రెస్ సభ్యులు

రామడుగు: రామడుగు మండల పరిషత్ అధ్యక్షురాలు కలిగేటి కవితపై మెజారిటి ఎంపీటీసీ సభ్యులు తిరుగుబావుటా ఎగురవేశారు. మండలంలోని 14 మంది ఎంపీటీసీ సభ్యుల్లో పదిమంది బీఆర్ఎస్ చెందిన ఎంపీపీపై మంగళవారం ఆర్డీవోకు అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో వాటర్ ప్లాంట్ దగ్ధం



షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమవుతున్న వాటర్ ప్లాంట్ సామగ్రి

మల్లాపూర్ : మండలంలోని మొగిలిపేటలో ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్ మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఘటనలో మోటార్, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ప్యాక్స్ వైస్ చైర్మన్ దూలూరి సుధాకర్‌రెడ్డి, గ్రామస్తులు ఘటనాస్థలికి చేరుకుని మంటలు ఆర్పివేశారు.

ఆగిన ఆటోడ్రైవర్ ఊపిరి



సతీశ్ (ఫైల్)



విలపిస్తున్న భార్య, పిల్లలు, కుటుంబికులు

ముస్తాబాద్(సిరిసిల్ల): కిరాయిలు రావడం లేదని.. ఆందోళనకు గురైన ఓ ఆటోడ్రైవర్ గుండె ఆగిపోయింది. గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపిన వివరాలు. మండలంలోని కొండాపూర్‌కు చెందిన ఆటోడ్రైవర్ గూడెపు సతీశ్(37) మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఉదయమే ఆటో నడిపేందుకు సిద్ధమవుతున్న సతీశ్ ఒక్కసారిగా గుండెలో నొప్పితో కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించేలోపే ప్రాణాలు కోల్పోయాడు. సతీశ్ పదేళ్లుగా ముస్తాబాద్ నుంచి సిరిసిల్లకు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల ఉచిత ఆర్టీసీ బస్ ప్రయాణం పెట్టారని, గిరాకీ తగ్గిందని సతీష్ ఆందోళనకు గురయ్యాడు. దానికితోడు అప్పులు ఎలా తీర్చేదని మానసిక వేదనకు గురయ్యాడు. ముస్తాబాద్‌లో సైతం తోటి ఆటోకార్మికులతో ధర్నాలో పాల్గొన్నాడు. సతీశ్ మృతితో భార్య వనిత, కుమార్తె ప్రశస్త, కుమారుడు జశ్విన్ రోదున పడ్డారు. సతీశ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆటోడ్రైవర్ యూనియన్ బాధ్యులు శంకర్‌గౌడ్, రాములు కోరారు.

కొడుకు ఆరోగ్యం కుదుటపడడం లేదని..

- ఉరేసుకుని తండ్రి ఆత్మహత్య
- డబ్బా గ్రామంలో విషాదం

ఇబ్రహీంపట్నం: కొడుకు పుట్టాడని ఆ తండ్రి ఎంతో సంతోషించాడు. అంతలోనే కొడుకు అనారోగ్యం బారిన పడడంతో తల్లడిల్లాడు. కుమారుడిని దక్కించుకునేందుకు రూ.లక్షలు ఖర్చు చేశాడు. అయినా పిల్లాడి ఆరోగ్యంలో మార్పు రాలేదు. దీంతో మనస్తాపానికి గురైన తండ్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామంలో విషాదం నింపింది. ఎస్సై ఉమాసాగర్ కథనం ప్రకారం.. మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన పొన్నం శ్రీనివాస్, హరిణి దంపతులు. వీరికి నాలుగు నెలల క్రితం కొడుకు జన్మించాడు. పుట్టిన మూడు రోజులకే అనారోగ్యం బారిన పడడంతో ఆపరేషన్ చేశారు. ఇందుకు రూ.4లక్షల వరకు ఖర్చయింది. అయినా కొడుకు ఆరోగ్యం మెరుగుపడలేదు. ఈ క్రమంలో సోమవారం హరిణి కొడుకును తీసుకుని పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో ఒక్కడే ఒంటరిగా ఉన్నాడు. మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హరిణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తనయుడిపై గొడ్డలితో తండ్రి దాడి

- పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు



మెడపై గొడ్డలి గాయం

చందుర్తి(వేములవాడ): భూ వివాదంలో తనయుడు తరచూ గొడవ పడుతున్నాడని తండ్రి గొడ్డలితో దాడిచేసిన సంఘటన చందుర్తి మండలం తిమ్మాపూర్‌లో సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన ఆవునూరి శంకర్‌కు ఐదుగురు కొడుకులు. ముగ్గురు జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లారు. మూడో కొడుకు, చిన్న కుమారుడు ఇంటి వద్ద ఉన్నారు. మూడో కొడుకు భాస్కర్, తండ్రి శంకర్ కొద్ది రోజులుగా గొడవ పడుతున్నారు. సోమవారం రాత్రి అందరూ నిద్రిస్తుండగా తండ్రి శంకర్ గొడ్డలితో తనయుడు భాస్కర్‌పై దాడి చేశాడు. గమనించిన భాస్కర్ తప్పించుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. బాధితుడు భాస్కర్ ఫిర్యాదుతో తండ్రి శంకర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు చందుర్తి ఎస్సై అశోక్ తెలిపారు. కాగా నిందితుడు శంకర్ తప్పించుకుని పారిపోయాడు.

‘కేశోరామ్’ను సందర్శించిన వాగేశ్వరి విద్యార్థులు



సిమెంట్ ఫ్యాక్టరీ ఎదుట విద్యార్థులు

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీ వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ‘అకాడమిక్ – ఇండస్ట్రీ ఇంటరాక్షన్ ’ లో భాగంగా పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌లోని ‘కేశోరామ్ సిమెంట్స్ లిమిటెడ్’ సంస్థను మంగళవారం సందర్శించారు. సిమెంట్ ఉత్పత్తి విధానాన్ని పరిశీలించారు. కంపెనీలోని వివిధ విభాగాల నిర్వహణ పద్ధతులను అధ్యయనం చేశారు. సంస్థ గురించి విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు అధికారులు వివరంగా వివరణ ఇచ్చారు. విద్యార్థులు క్లాస్‌రూంలో తెలుసుకున్న విషయాలను సంస్థ నిర్వహణలో విషయాలతో సరిపోల్చికొని అవగాహన చేసుకున్నారు. ప్రొడక్షన్ మేనేజర్ సదానందం, సేఫ్టీ మేనేజర్ సాయికిరణ్ విద్యార్థులకు కంపెనీ నిర్వాహణ విధానాలు వివరించారు. కళాశాల జనర్ సెక్రటరీ డా.గంద్ర శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు అన్ని మేనేజ్ మెంట్ విషయాలను ప్రాక్టికల్‌గా తెలుసుకుంటూ ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, డైరక్టర్లు విశ్వప్రకాశ్‌రెడ్డి, వినోద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. శ్రీనివాస్, ఎంబీఏ హెచ్‌వోడీ హరిప్రసాద్‌వర్మ, శ్రీధర్‌రెడ్డి, విజయకుమార్, అర్చన, అస్మాబేగం తదితరులు పాల్గొన్నారు.


వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి దంపతులు

రామడుగు: కరీంనగర్ జిల్లా రామడుగు మండలం దేశరాజ్‌పల్లి గ్రామ పరిధిలోని అల్ఫోర్స్ విద్యా సంస్థల ప్రాంగణంలో మంగళవారం శ్రీశివపార్వతుల కల్యాణోత్సవం వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఉత్సవంలో పాల్గొన్న అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి మాట్లాడారు. శివపార్వతుల కల్యాణం మహిమాన్వితమైందని, శుభఫలాలను అందిస్తుందన్నారు. మూడో రోజు గురవందన పర్వక, గో గణపతి, గౌరీ స్థాపిత మంటపజాదిలు, సప్తశతీ పారాయణం, నవార్ణమంత్ర జపం, అమ్మవారికి అభిషేకం, అర్చనలు, మహాన్యాసపర్వక రుద్రాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పురోహితులు, పాఠశాల, కళాశాల ల సిబ్బంది, భజన బృందాలు, భక్తులు పాల్గొన్నారు.

ఇస్రోలో టీవోగా పోరుమల్ల వాసి



శ్రావణ్

మెట్‌పల్లి: జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో జేఈగా పనిచేస్తున్న పొట్టవత్తిని శ్రావణ్‌కుమార్ భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)లో టెక్నికల్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. మేడిపల్లి మండలం పోరుమల్లకు చెందిన శ్రావణ్‌కుమార్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదివారు. ఏపీఆర్‌జేసీ రాసి రాష్ట్రస్థాయిలో 11 ర్యాంకు సాధించి నిమ్మకూర్‌లోని కళాశాలలో ఇంటర్ పూర్తిచేశారు. హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేసి బీఎస్ఎన్ఎల్‌లో జేఈగా చేరారు. ఇస్రోలో శాస్త్రవేత్త కావాలన్న లక్ష్యంతో ఆ ఉద్యోగం చేస్తూనే ఖాళీ సమయంలో పుస్తకాలతో కుస్తీ పట్టారు. కొన్నినెలల క్రితం ఇస్రోకు సంబంధించి టీఓ పరీక్ష రాసి ఆల్ ఇండియా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. జేఈ ఉద్యోగానికి రాజీనామా చేసిన ఆయన.. ఈనెల 29న బెంగళూర్‌లోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో ఉద్యోగంలో చేరనున్నారు. టీఓ నుంచి శాస్త్రవేత్తగా పదోన్నతి పొందవచ్చని శ్రావణ్‌కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.

పూతకొస్తున్న మామిడి

- రైతుల్లో చిగురిస్తున్న ఆశలు
- జిల్లాలో 70వేల ఎకరాల్లో సాగు
- తోటలను లీజుకు తీసుకుంటున్న దళారులు



రసాయన మందు పిచికారీ చేస్తున్న రైతు

జగిత్యాలఅగ్రికల్చర్: ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు మామిడికి అనుకూలంగా మారాయి. ఇప్పుడిప్పుడే పూతలు ప్రారంభమయ్యాయి. దీంతో రైతులు తెగుళ్లు, పురుగులు ఆశించకుండా తోటల్లో రసాయన మందులు పిచికారీ చేస్తున్నారు. వారంరోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతుండటం కొంత ఆందోళనకరంగా మారినప్పటికీ ఉష్ణోగ్రతలు పెరిగితే పూత బాగా వచ్చే అవకాశం కనిపిస్తోంది.

70 వేల ఎకరాల్లో మామిడి సాగు

జిల్లాలో దాదాపు 70 వేల ఎకరాల్లో మామిడితోటలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో మామిడి మార్కెట్ ఉండటం, వ్యాపారులు నేరుగా ఢిల్లీలాంటి నగరాలకు కిసాన్ రైలు ద్వారా తరలించడం, లీజుకు తీసుకున్న దళారులు నాగ్‌పూర్ మార్కెట్‌కు తరలిస్తుండటంతో మామిడికి మంచి రేటు వస్తోంది. మామిడి తోటలకు అనువైన వాతావరణంతోపాటు ఎర్రనేలలు, గులక రాళ్ల నేలలు జిల్లాలో ఎక్కువగా ఉండటంతో నాణ్యతతో కూడిన దిగుబడులు వస్తుంది. రెండేళ్లుగా మామిడి దిగుబడి ఆశాజనకంగా రాకపోవడంతో రైతులతోపాటు లీజుదారులు ఇబ్బంది పడ్డారు. ఈ ఏడాది వర్షాలు ఉండటంతోపాటు సాగునీరుకు ఢోకా లేకపోవడం, మంచి ధర వస్తుందనే ఉద్దేశంతో రైతులు ఖర్చుకు వెనుకాడకుండా పురుగుమందులు పిచికారీ చేస్తున్నారు. రసాయన ఎరువులతోపాటు అన్ని రకాల యాజమాన్య పద్ధతులు పాటిస్తున్నారు.

పూతకు సమయమిదే

మామిడి పూత సాధారణంగా డిసెంబర్–జనవరి నెలల్లో ప్రారంభమై ఫిబ్రవరి మొదటి వారం వరకు వస్తుంటుంది. మామిడి సాగులో 8 నెలల పాటు చేపట్టే యాజమాన్య పద్ధతులు ఒక ఎత్తైతే, పూత నుంచి కోత వరకు నాలుగు నెలల పాటు చేపట్టే యాజమాన్య పద్ధతులు మరో ఎత్తు. ఇప్పటికే ఎకరానికి రూ.15 వేల విలువైన రసాయన మందులు పిచికారీ చేస్తున్నారు. అలాగే వచ్చిన పూతను నిలబెట్టుకోవడానికి మరోసారి రసాయన మందులు పిచికారీ చేసే పరిస్థితి ఉంది. ఈసారి వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండటంతో భూమిలోని తేమను బట్టి పూత కొన్ని ప్రాంతాల్లో ఆలస్యంగా వచ్చే అవకాశంఉంది. గతేడాది ఆలస్యంగా పూత రావడం.. పూత వచ్చే సమయానికి అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వేడి వాతావరణంతో పూతలో సగం రాలిపోయింది. ఈ ఏడాది డిసెంబర్ మొదటి వారం నుంచి పూత వస్తుండటంతో పూత కాతగా మారుతుందని రైతులు ఆశిస్తున్నారు.

ముందే అడ్వాన్సులు ఇస్తున్న లీజుదారులు

మామిడికాయలు తెంపుకునేందుకు దళారులు ముందే రైతులకు అడ్వాన్సులు ఇస్తున్నారు. తోటల్లో వచ్చిన పూతను చూసి లీజుదారులు నిర్ణయించేందుకు దళారులు తోటల వెంబడి తిరుగుతున్నారు. జిల్లాలోని రైతుల్లో దాదాపు 75 శాతం లీజుకు ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది మామిడికి డిమాండ్ ఉంటుందనే ఉద్దేశంతో లీజుదారులు తోటలను లీజుకు తీసుకునేందుకు పోటీ పడుతున్నారు. ఆయా ప్రాంతాలను బట్టి ఎకరాకు రూ.80 నుంచి రూ.లక్ష వరకు రేటు పెడుతున్నారు.

పూతపై వాతావరణ ప్రభావం



గాలిలో తేమ శాతం తక్కువగా ఉండటం, రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడం మామిడి పూతపై ప్రభావాన్ని చూపుతాయి. ఉష్ణోగ్రతలు పెరగడంతోపాటు పొడి వాతావరణం ఉంటే పూత బాగా వస్తుంది. పూత సమయంలో ఎలాంటి పనులు చేయొద్దు.

– ప్రతాప్‌సింగ్, జిల్లా ఉద్యానశాఖాధికారి, జగిత్యాల